గోశాలలో అంకుట్ మహోత్సవం

జియాగూడ : జియాగూడలోని సమర్థ నారాయణ ఆశ్రమంలోని కామధేను గోశాలలో ఈనెల 17న ఆదివారం గోమాత మహోత్సవం, సంకీర్తన గోపూజ, గోసేవా, అంకుట్ కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు మఠాధిపతి ప్రభుదత్త మహారాజ్ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు శ్రీ సుందరకాండ తులసి మానస, హనుమాన్ చాలీసా పారాయణం, ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం గోమాత అకుంట్ ప్రసాద కార్యక్రమం నిరవధికంగా జరుగుతుందన్నారు.

ప్రారంభమైన స్వచ్ఛత పఖ్వాడా కార్యక్రమాలు



ఐసీఏఆర్-క్రీడా డైరెక్టర్ డాక్టర్ వి.కె.సింగ్ తదితరులు

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని ఐసీఏఆర్-కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐసీఏఆర్-క్రీడా)లో శనివారం స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత పఖ్వాడా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐసీఏఆర్-క్రీడా డైరెక్టర్ డాక్టర్ వి.కె.సింగ్ పాల్గొని పక్షోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో పాటు 100 మంది సభ్యులకు స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ పక్షోత్సవాలు ఈనెల 31వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. పక్షం రోజులపాటు క్రీడలో ఉద్యోగులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు, పరిశుభ్రత, డిబెట్ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నామన్నారు.

'చావు'కొచ్చింది!

- అభివృద్ధికి నోచుకోని షేక్‌పేట్ హిందూ శ్మశానవాటిక
- విద్యుత్, నీరు, కనీస వసతులు కరువు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

గోల్కొండ: షేక్‌పేట్‌లోని హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి నోచుకోవడం లేదు. సుమారు మూడెకరాల్లో ఉన్న ఈ హిందూ శ్మశానవాటిక దశాబ్దాలుగా ఎక్కడ ఉన్న గొంగలి అక్కడే అన్నట్లుగా ఉంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలో అత్యంత సంపన్నమైన షేక్‌పేట్ డివిజన్‌లోని ఈ శ్మశానవాటిక అభివృద్ధిని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

◆ గత 20 ఏళ్ల క్రితం అప్పటి షేక్‌పేట్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం జరిగింది. ఒక బోరు, స్నానపు గదులు, దహనవాటిక పనులను ప్రారంభించారు. కాలక్రమేణ శ్మశానవాటిక అస్తవ్యస్తంగా మారి బోరు చెడిపోయింది. దీంతో స్నానాలకు బయట నుంచే నీరు తెచ్చుకోవాల్సి పరిస్థితి ఉందని ప్రజలు వాపోతున్నారు.

పరదాలు వేసుకోవాల్సిన పరిస్థితి..

స్నానపు గదులు లేకపోవడంతో పరదాలు వేసుకుని స్నానం చేయాల్సిన దుస్థితి నెలకొంది. రాత్రిపూట జరిగే అంత్యక్రియలు విద్యుత్ సరఫరా లేకపోవడంతో చీకట్లోనే అంత్యక్రియలు జరుగుతున్నాయి.

ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు..

మరోవైపు దహనవాటికతో పాటు శ్మశానవాటికలో సమాధులు ఉన్న చోట పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. వాటి మధ్యలో సమాధులు ఎక్కడున్నాయో.. తెలియని పరిస్థితి ఉంది. వాచ్‌మెన్ లేకపోవడంతో పగలు, రాత్రి మూగ జీవాలకు ఆవాసాలుగా మారుతోంది. సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు తెరిచి ఉన్న గేట్ల ద్వారా గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి వ్యర్థాలను డంపింగ్ చేస్తున్నారు. దీంతో ఇక్కడికి వచ్చే వారు చెత్త కుప్పలను దాటి వెళ్లాల్సి వస్తుంది. పలుసార్లు చనిపోయిన జంతువుల కుళ్లిపోయిన కళేబరాలు సైతం కనబడుతుంటాయి. ఎవరైనా చనిపోయినప్పుడు వారి కుటుంబ సభ్యులే కాటి కాపరిని పిలుచుకుని వచ్చి పని కానిస్తున్నారు. సాయంత్రం కాగానే భయంభయంగా ఉంటుందని అంత్యక్రియలకు వచ్చే వారంటున్నారు.

అసంపూర్తి పనులు...

- ◆ శ్మశానవాటికలో స్నానపు గదులు అసంపూర్తిగా ఉన్నాయి.
- ◆ దహనవాటికతో పాటు చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. ప్రహరీకి ఉన్న గేట్ల వద్దే చెత్త డంపింగ్ జరుగుతోంది.
- ◆ ప్రధాన ద్వారాల్లో ప్రస్తుతం ఒకటి మాత్రమే ఉంది. మరో గేటు అనవాళ్లు కనిపించని పరిస్థితి ఉంది.
- ◆ శ్మశానవాటికలో ఎన్నో వస్తువులు దొంగలు ఎత్తుకెళ్లారని స్థానికులు చెబుతున్నారు.
- ◆ గేట్ కీపర్ (వాచ్‌మెన్) లేకపోవడంతో శ్మశానవాటికకు రక్షణ లేకుండా పోయింది.
- ◆ గత రెండు దశాబ్దాలుగా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు.
- ◆ శ్మశానవాటిక నిర్వహణను బల్దియా వారు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.
- ◆ ఇతర ప్రాంతాల శ్మశానవాటికల్లో అభివృద్ధి పనులు జరిగాయని, షేక్‌పేట్ హిందూ శ్మశానవాటిక అభివృద్ధిని మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపణలున్నాయి.



షేక్‌పేట్ హిందూ శ్మశానవాటిక



అసంపూర్తిగా నిలిచిపోయిన గదుల నిర్మాణ పనులు

బల్దియా వారు పట్టించుకోవాలి..



నగరంలో అత్యంత పురాతనమైన శ్మశానవాటికల్లో షేక్‌పేట్ హిందూ శ్మశానవాటిక ఒకటి. బల్దియా వారు దీని నిర్వహణను వెంటనే చేపట్టాలి. మృతి చెందిన తమ కుటుంబసభ్యులను ఈ శ్మశానవాటికకు తీసుకురావడానికి స్థానికులు వెనుకాడుతున్నారు.

– కంది మోహన్‌రెడ్డి, షేక్‌పేట్

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..



షేక్‌పేట్ హిందూ శ్మశానవాటిక విషయంపై రాష్ట్ర మంత్రుల దృష్టికి తీసుకువెళ్తాను. శ్మశానవాటికకు వెంటనే గేట్లు వేసి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది. బల్దియా వారు సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయాలి. స్నానపు గదులను నిర్మించి వెంటనే బోరు వేసేలా బల్దియా అధికారులు కృషి చేయాలి. – డి.సత్యనారాయణ, షేక్‌పేట్

ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు ఆహ్వానం



ఆహ్వానపత్రాన్ని అందజేస్తున్న ఆత్రేయాచార్యులు

చార్మినార్: చార్మినార్ చౌక్ మైదాన్‌లోని బాలాజీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 23న అత్యంత వైభవంగా నిర్వహించే ముక్కోటి ఏకాదశి మహోత్సవ కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ.. దక్షిణ మండలం డీసీపీ పోతురాజు సాయి చైతన్యకు దేవాలయ ప్రధాన పూజారి శ్రుంగారం రమనాచార్యులు ఆహ్వానపత్రం అందజేశారు. ఈనెల 23 నుంచి జనవరి 16వ తేదీ వరకు ఉత్సవాలు జరుగనున్న విషయాన్ని ఆయనకి వివరించారు. ప్యారసాని వెంకటేష్, శ్రీనివాస్ బన్సల్ తదితరులున్నారు.

ఎన్నికలు ముగిసినా తొలగించని సైన్‌బోర్డులు

చార్మినార్: 2023 ఎన్నికల ప్రక్రియ ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటికీ కొంతమంది అధికారులు తమ కార్యాలయ రూపురేఖలను మార్చడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అప్పుడున్న సైన్‌బోర్డులనే ఇంకా కొనసాగిస్తూ.. విధి నిర్వహణ జరుగుతోంది. చార్మినార్ సర్కిల్-9 డిప్యూటీ కమిషనర్ కార్యాలయం భవనంలో చార్మినార్ ఆర్వో బోర్డులు ఇంకా అలాగే ఉన్నాయి. దీంతో వివిధ పనుల కోసం కార్యాలయానికి వస్తున్న ఫిర్యాదుదారులు అయోమయానికి గురౌతున్నారు. మొఘల్‌పురాలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ భవన సముదాయంలో సర్కిల్-9 డీసీ కార్యాలయం కొనసాగుతోంది. 2023 ఎన్నికలను పురస్కరించుకుని చార్మినార్ రిటర్నింగ్ అధికారి, జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ ఆర్వో కార్యాలయాన్ని మొఘల్‌పురా స్పోర్ట్స్ కార్యాలయంలో ఏర్పాటు చేయించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే ఆయన తన రోజువారి కార్యకలాపాలను ఎప్పటిలాగే పూల్‌బాగ్‌లోని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ కార్యాలయం నుంచి కొనసాగిస్తున్నారు. సైన్‌బోర్డులను తొలగించకపోవడంతో సందర్శకులు అయోమయానికి గురౌతున్నారు.

అయ్యప్పలకు కేరళ ప్రభుత్వం సౌకర్యాలు కల్పించాలి



మైనంపల్లిని సత్కరిస్తున్న దృశ్యం

అబిడ్స్ : అయ్యప్ప భక్తులకు కేరళ ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పించాలని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పేర్కొన్నారు. అక్షలాది మంది అయ్యప్పలు కేరళలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ధూల్‌పేట్‌లో మాజీ కార్పొరేటర్ ముఖేష్‌సింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అయ్యప్పస్వామి మహాపడిపూజలో ఆయన పాల్గొని పూజలు చేశారు. పరమేశ్వరి సింగ్, మాజీ కార్పొరేటర్ ముఖేష్‌సింగ్, ఎస్.ధన్‌రాజ్, శ్రీనుగౌడ్, శాంతిదేవి, సురేష్, ముఖేష్‌ముదిరాజ్ పాల్గొని పూజలు చేశారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు దోహదం



సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

సుల్తాన్‌బజార్: అనువర్తిత జంతుశాస్త్రం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు దోహదపడుతుందని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎం.విజ్జులత అన్నారు. మహిళా విశ్వవిద్యాలయం హైదరాబాద్ చాప్టర్, జువాలజీ శాఖ, తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయం ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం విశ్వవిద్యాలయంలోని పీజీ సెమినార్ హాల్‌లో అనువర్తిత జంతుశాస్త్రంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ విజ్జులత హాజరై సెమినార్‌ను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సదస్సులు విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఉపయోగపడతాయన్నారు. జీవశాస్త్రంలో వారి పురోగతిని మెరుగుపరిచేందుకు, నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఇలాంటి సదస్సులు ఎంతో అవసరమన్నారు. ఉస్మానియా మహిళా కళాశాల శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఇలాంటి సెమినార్‌లు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ప్రొఫెసర్ నాగయ్య, డాక్టర్ ప్రదీప్ కునాల్, సునీళకుమారి, ప్రొఫెసర్ నాగరాజరావు, వీణా మధుసూదన్, ప్రదీప్‌కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

జేసీజేగా అర్హత సాధించిన స్వారికకు సన్మానం



సన్మానిస్తున్న గౌలిపురా కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

గౌలిపురా: గౌలిపురా అంబికానగర్ ప్రాంతానికి చెందిన సూక్ష్మ కళాకారిణి రామగిరి స్వారిక- 2023 పోటీ పరీక్షల్లో జూనియర్ సివిల్ జడ్జిగా ఉత్తీర్ణత సాధించడంపై శనివారం గౌలిపురా డివిజన్ కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మితో పాటు నాయకులు ఆమె నివాసానికి వెళ్లి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. అతి చిన్న వయస్సులో న్యాయవాద విద్యను అభ్యసించి జూనియర్ సివిల్ జడ్జి కావడం అభినందనీయమన్నారు. రామగిరి స్వారిక నేటితరం యువతులకు ఆదర్శంగా నిలిచారన్నారు. స్వారిక తల్లిదండ్రులు శ్రీనివాస్, శ్రీలతలు ఎంతో కష్టపడి చదివించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను ఆమె అధిరోహించాలని ఆకాంక్షించారు. బీజేపీ నాయకులు సుమన్‌కుమార్‌ముదిరాజ్, జమాల్‌పూర్ అశోక్, రాజ్‌కుమార్‌ముదిరాజ్, రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాపు, రమణ పురస్కారాల ప్రదానం



పురస్కారాలను ప్రదానం చేస్తున్న ప్రముఖ సినీనటులు, దర్శకులు

సుల్తాన్‌బజార్: పద్మశ్రీ బాపు పుట్టినరోజు సందర్భంగా 'పూతరేకుల పండుగ చేసుకుందాం రండి' అనే శీర్షికన బాపు, రమణ పురస్కార ప్రదానోత్సవం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తులో వైభవంగా జరిగింది. ముఖ్య అతిథులుగా ప్రముఖ సినీనటులు రచయిత ఎన్నికల భరణి, ప్రముఖ దర్శకులు రేలంగి నర్సింహారావు, రచయిత సుద్దాల అశోక్‌తేజ, సినీనటులు డాక్టర్ సుదర్శన్‌లు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ చిత్రకారుడు డాక్టర్ లక్ష్మణ్, ప్రముఖ రచయిత మాడభూషి శ్రీధర్‌లకు పురస్కారాలను ప్రదానం చేశారు. సంస్థ గౌరవ అధ్యక్షులు భీమారావు, కార్యదర్శి ప్రముఖ రచయిత వేగిరాజు సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు. ప్రేక్షకులకు పూతరేకులను పంపిణీ చేశారు.

సందడిగా పర్యాటక ప్రాంతాలు



చార్మినార్-గుల్జార్‌హౌజ్ రోడ్డులో సందర్శకుల సందడి

చార్మినార్: పాతబస్తీలోని పర్యాటక స్థలాలు పర్యాటకులతో సందడిగా మారాయి. శనివారం చార్మినార్, మక్కామసీదు, సాలార్‌జంగ్ మ్యూజియం, చౌమహల్లా ప్యాలెస్‌లకు సందర్శకుల తాకిడి ఎక్కువైంది. సాలార్‌జంగ్ మ్యూజియంలో ఏర్పాటు చేసిన స్పెషల్ ఎగ్జిబిషన్ సందర్శకులను ఆకట్టుకుంటోంది. మ్యూజియం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సాలార్‌జంగ్ మ్యూజియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫోటో ప్రదర్శనను పర్యాటకులు ఆసక్తిగా తిలకించారు. శనివారం పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరగడంతో చిరు వ్యాపారాలతో పాటు షోరూం వ్యాపారాలు సైతం జోరుగా కొనసాగాయి. సందర్శకులు చార్మినార్ చుట్టూ ఏర్పాటు చేసిన గ్రానైట్‌రోడ్డులో సెల్ఫీలు దిగుతూ సరదాగా గడిపారు.



గోల్కొండ వద్ద క్యాప్‌లు కొంటున్న పర్యాటకులు

గోల్కొండ: పర్యాటక ప్రాంతమైన గోల్కొండ కోట గత కొద్ది రోజుల నుంచి పర్యాటకులతో కిటకిటలాడుతోంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు కోటలో సందడి చేస్తున్నారు. కోట ముందున్న క్యాప్ సెంటర్లు పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణగా మారాయి. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే పర్యాటకులు రంగు రంగుల క్యాప్‌లనుకొని సంబురపడుతున్నారు. ఈ క్యాప్‌స్టాల్స్‌లో కౌబాయ్ క్యాప్, ప్రిన్సెస్ డయానా క్యాప్ పర్యాటకులను ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా క్యాప్‌లు కొంటున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి ఆత్మహత్య

రాజేంద్రనగర్: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..చింతల్‌మేట్ ప్రాంతానికి చెందిన మహ్మద్ అస్లాం (30) ఆటోడ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి అస్లాం బుద్వేల్ ప్రాంతంలోని తనకు పరిచయస్తురాలైన జన్నత్‌బేగం ఇంటికి వచ్చాడు. అయితే జన్నత్‌బేగం తన కుటుంబ సభ్యులతో కలిసి బయటకు వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండగా..అస్లాం తాళం పగులగొట్టి ఇంట్లోకి వెళ్లాడు. శనివారం ఉదయం జన్నత్‌బేగం ఇంటికి వచ్చి చూడగా మహ్మద్ అస్లాం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో విషయాన్ని రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహన్ని ఉస్మానియాకు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న మహ్మద్ అస్లాం తల్లిదండ్రులు సంఘటన స్థలానికి చేరుకొని జన్నత్ బేగం, ఆమె కుమారులు, మరికొంత మంది కలిసి మహ్మద్‌అస్లాంను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపించారు.

36వ సారి అయ్యప్ప మాలధారణ



కృష్ణమూర్తి గురుస్వామి

అబిడ్స్ : అయప్ప భక్తులు భక్తిశ్రద్ధలతో 41 రోజులపాటు మాలధారణ చేస్తారు. అధిక శాతం 18 సార్లు మాత్రమే శబరిమలైకు వెళ్తుంటారు. కానీ నగరానికి చెందిన బొమ్మరాజు కృష్ణమూర్తి గురుస్వామి (మూర్తి గురుస్వామి) తన 36వ అయ్యప్పదీక్షను ఏకంగా రెండుసార్లు 18 పడులు కొనసాగించారు. బ్రహ్మశ్రీ వేణుమాధవ్‌శర్మ గురుస్వామి నుంచి బొమ్మరాజు కృష్ణమూర్తి గురుస్వామి అయ్యప్ప దీక్షను 36వ ఏటా స్వీకరించి శబరిమలైకు తరలివెళ్లారు. ఇలా 36 సార్లు దీక్ష ధరించిన వారికి శబరిమలై అయ్యప్పస్వామి ఆలయంలో రాజదండాన్ని అందించి అయ్యప్ప దర్శనానికి పంపిస్తారు. శనివారం బొమ్మరాజు కృష్ణమూర్తి గురుస్వామి ఎంతో ప్రత్యేకమైన రాజదండమును స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన జీవితంలో ఇలాంటి విశేష ఘటన పొందడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. జీవితాంతం ఆధ్యాత్మిక కార్యక్రమాలతో జీవనం గడుపుతానన్నారు.

డాటా సైన్స్‌పై అంతర్జాతీయ సదస్సు

గోల్కొండ: డాటా సైన్స్, మెషిన్ లర్నింగ్ నేటి సాంకేతిక రంగంలో అత్యంత ప్రాధాన్యం ఉన్న రంగాలని అమెరికాలోని సాన్‌జోస్ యూనివర్సిటీ డీన్ డాక్టర్ విష్ణు ఎస్. పెండ్యాల అన్నారు. డాటా సైన్స్, మెషిన్ లర్నింగ్, అప్లికేషన్స్ తదితర విషయాలపై 5వ అంతర్జాతీయ సదస్సు శనివారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా వచ్చి విద్యార్థులతో మాట్లాడారు. జీఎన్‌టీఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఇలాంటి సదస్సులు శాస్త్రసాంకేతిక రంగాల్లో ఉన్న వారికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, హార్డ్‌వేర్, బ్యాంకింగ్‌తో పాటు హెల్త్‌కేర్, ఆటోమేషన్ అండ్ ఇన్నొవేషన్ రంగాల్లో కూడా సాంకేతిక పరిజ్ఞానం బదిలీ లేదా పంచుకోవడం అత్యంత ప్రాధాన్యమైందన్నారు. జీఎన్‌ఐజీఎస్ చైర్మన్ రాఘవరెడ్డి, జీఎన్‌ఐటీఎస్ వైస్ చైర్‌పర్సన్ శ్రీవిద్యారెడ్డి, డాక్టర్ రవిప్రకాష్‌రెడ్డి, డాక్టర్ ఎస్.రామచంద్రన్ తదితరులున్నారు.

సిటీ కాలేజీ విద్యార్థికి అభినందన



చార్మినార్: తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం తెలుగుశాఖ నిర్వహించిన జాతీయ స్థాయి కవితల పోటీలో సిటీ కాలేజీలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి చిక్కొండ రవికి ద్వితీయ బహుమతి లభించడం పట్ల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బాల భాస్కర్ ప్రశంసాపత్రంతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన ధర్మనిధి సదస్సులో విశ్వ విద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య దూపూరి భారతి, సుప్రసిద్ధ రచయిత్రి ఓల్గా తదితరులు రవికి రూ.2,500 నగదు బహుమతిని అందజేశారు.

మార్ఫింగ్ ఫొటోలతో బెదిరించిన నిందితుడి రిమాండ్

దూద్‌బౌలి: ఇన్‌స్టాగ్రాం ప్రొఫైల్ నుంచి చిత్రాన్ని సేకరించి దానిని అశ్లీల చిత్రంగా మార్ఫింగ్ చేసి బెదిరింపులకు పాల్పడిన నిందితుడిని హుస్సేనీ ఆలం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. హుస్సేనీ ఆలం ప్రాంతానికి చెందిన మనీష్ వర్మ ఓ మహిళ ప్రొఫైల్‌పిక్‌ను సేకరించి మార్ఫింగ్ చేసి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాడు. డబ్బులు ఇవ్వకపోతే సోషల్ మీడియాలో డౌన్‌లోడ్ చేస్తానంటూ.. బెదిరింపులకు పాల్పడుతున్నాడని పేర్కొంటూ.. బాధిత మహిళ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసిందని, బాధితురాలి ఫిర్యాదు మేరకు తాము దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

కార్వాన్ సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తుతా !



ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన అసెంబ్లీ సమావేశాలకు బయలుదేరే ముందు హకీంపేట్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలని అడుగుతామని, రేవంత్‌రెడ్డి మూసీ పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి జరిగిన సమావేశానికి తనను కూడా ఆహ్వానించారన్నారు. మూసీ నదితో కార్వాన్ నియోజకవర్గానికి ఎంతో సంబంధం ఉందని కార్వాన్ మీదుగా ఈ నది ప్రవహిస్తుందన్నారు. మూసీ గట్టున ఆధునిక దోభీఘాట్‌లను నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. కబ్జాకు గురైన స్థలాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వాన్ని వివరిస్తామన్నారు. లంగర్‌హౌజ్, కార్వాన్, జియాగూడ తదితర ప్రాంతాల్లో మూసీ పరివాహక ప్రాంతంలో పార్కులు, గ్రీన్‌షెల్టర్లు అభివృద్ధి చేసేందుకు సంబంధిత మంత్రిని కోరుతామన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో అన్నదానం



గోల్కొండ: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగుల సహాయకులకు రోజూ ఒకపూట భోజనం ఇవ్వడమే తమ లక్ష్యమని ప్రముఖ సంఘ సేవకుడు గోల్కొండ మోతీదర్వాజ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహ్మద్ బషీర్ అన్నారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి తదితర ప్రాంతాల్లో ఆసుపత్రిలో ఉన్న రోగుల సహాయకులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా రోజూ తాము ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

నోబుల్ టాకీస్ చౌరస్తాలో ట్రాఫిక్‌జామ్



చౌరస్తాలో స్తంభించిన ట్రాఫిక్

నాంపల్లి : మల్లెపల్లి నోబుల్ టాకీస్ చౌరస్తాలో ట్రాఫిక్ స్తంభించింది. చౌరస్తాను కలిపే రహదారులపై వాహనాలు బారుల తీరాయి. శనివారం రాత్రి 9 గంటల వరకు ఇదే పరిస్థితి కనిపించింది. క్రమబద్ధీకరించాల్సిన పోలీసులు విధుల్లో లేరని వాహనదారులు వాపోయారు. ఉదయం, సాయంత్రం వేళల్లో నిత్యం నరకప్రాయంగా మారింది. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సంబంధిత అధికారులు చూడాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. రోడ్లపైనే తోపుడు బండ్లు, ద్విచక్రవాహనాల పార్కింగ్‌తో ఇలాంటి సమస్య ఉత్పన్నం అవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ట్రాఫిక్ ఉన్నతాధికారులు మల్లేపల్లి నోబుల్ టాకీస్ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పీఎస్‌ను సందర్శించిన చిన్నారులు

గచ్చిబౌలి: హలు కిడ్స్ స్కూల్ విద్యార్థులు శనివారం గచ్చిబౌలి పీఎస్‌ను సందర్శించారు. రిసెప్షన్‌తో పాటు విజిటర్స్ ఏరియా, ఎస్‌హెచ్‌ఓ రూమ్, లాకప్‌ను చూశారు. పోలీస్‌స్టేషన్ గురించి ఉపాధ్యాయులు చిన్నారులకు వివరించారు. సాధారణ విజిటర్స్‌తో పాటు చిన్నారులు రావడంతో పీఎస్ సందడిగా మారింది.

ప్రజా సేవకే జీవితం అంకితం

అబిడ్స్: ప్రజాసేవకే జీవితం అంకితమని వైఎస్సార్ కాంగ్రెస్ యువజన నాయకుడు డాక్టర్ మెట్టు శ్రీకాంత్ పేర్కొన్నారు. ప్రజా సంక్షేమానికి, ప్రజా అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఆగాపురాలో డాక్టర్ మెట్టు శ్రీకాంత్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు పలు పార్టీల నాయకులు పాల్గొని ఆయనను ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మెట్టు శ్రీకాంత్ మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటానన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మెట్టు రాఘవేంద్ర, డాక్టర్ మెట్టు ప్రసాద్, మెట్టు విజయ్‌కుమార్, ఎస్.ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ మెట్టు శ్రీకాంత్‌ను సత్కరించిన ధన్‌రాజ్ తదితరులు

సెమీ క్రిస్మస్ వేడుకలు



ధ్వని అసోసియేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్, సీనియర్ శాస్త్రవేత్త జస్టినా గీతా

సంతోష్‌నగర్: కంచన్‌బాగ్‌లోని డీఆర్‌డీఓ ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలను శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. బ్రదర్ సంపత్‌కుమార్ ఆరంభ ప్రార్థనలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ వేడుకలకు ధ్వని అసోసియేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్, సీనియర్ శాస్త్రవేత్త జస్టినా గీతా పాల్గొని కేక్‌కట్ చేసి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డిఫెన్స్ ల్యాబ్ క్వార్టర్స్‌లో ఉద్యోగులంతా కలిసి మెలిసి క్రిస్మస్ వేడుకలు నిర్వహించుకోవడం సంతోషకరమన్నారు. అనంతరం 2024 నూతన కేలండర్‌ను ఆవిష్కరించారు. ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ సుధాకర్‌రావు, వైస్ చైర్మన్ బాబురావు, సెక్రటరీ నరేష్, కోశాధికారి పవన్‌కుమార్, సీనియర్ కమిటీ సభ్యులు కృష్ణాచారి, అడ్వయిజరీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.